# మౌనంగానే మిగుల్దాని...

సి.వి.నరసింహదాసు

పరిగెడుతున్నాను.... శరీరంలో మిగిలివున్న శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకుని పరిగెడుతున్నాను.. అడుగులు తడబడుతున్నా, పదే పదే తూలి పడబోతున్నా తమాయించుకుని ముందుకు పరిగెడుతున్నాను... ఆయాసంతో కళ్ళు బైర్లు కమ్ముతున్నా, కాళ్ళు యిక సహకరించలేమని మొరాయిస్తున్నా, ప్రాణాలు అరచేతబట్టుకుని పరిగెడుతూనే వున్నాను.

ఒకటి కాదు.. రెండు ప్రాణాల జీవన్మరణ సమస్య... నేను... నా కడుపులో రూపుదిద్దుకుంటున్న ఏడోనెల బిడ్డ....

నిజానికి నాకు చావంటే భయం లేదు.. బ్రతుకుమీద ఆశ చచ్చిపోయి చాలా కాలమయింది.. ఇప్పుడు చావే నాకు సౌఖ్యమందించే నేస్తం..

కానీ నాలో ఏదో మొండి పట్టుదల.. ఎవరి మీదనో తెలియని కసి.. నన్ను నిర్ధేశించే అధికారం ఎవరికీ లేదని చెప్పాలనే ఆరాటం...

అందుకే పరిగెడుతున్నాను...

ఒకనాడు ఇదే పరుగు స్కూల్లో నాకు పతకాలు తీసుకువచ్చింది. నలుగురిలో గుర్తింపు తెచ్చి పెట్టింది.

''మీ అమ్మాయిలో అద్భుతమైన నైపుణ్యం వుంది సోమరాజు.. సానబెడితే వజ్రమౌతుంది... సరైన కోచ్ చేతిలో పడితే, మనకి మరో పిటి ఉష, అశ్వనీ నాచప్ప దొరికినట్టే... తప్పక ప్రోత్సహించు... నీకూ, నాకూ, మా స్కూల్‌కి, మన ఊరికి మంచి పేరు తీసుకొస్తుంది.. ఆ నమ్మకం నాకుంది..'' మా స్కూలు హెడ్ మాష్టారు నాన్నతో ఎన్నో మార్లు చెప్పారు.

నాన్న కళ్ళలో ఏదో నిస్సహాయత...

''మీకు తెలీనిదేముందయ్యా.. నాకున్న ముగ్గురు కూతుర్లలో కాస్తో, కూస్తో చదువు మీద మమకారం వున్నది ఈ చిన్నదానికేనయ్యా.. ఆ చదువే నాకు తలకు మించిన వ్యవహారం బాబూ... ఏ పూట నోట్లోకి కనీసం రెండు వేళ్ళయినా వెళతాయో, ఏ పూట పొయ్యిలో పిల్లి పడుకుంటుందో తెలీని జీవితం... కడుపునిండా ముద్ద పెట్టలేని వాడికి, యిక పిల్లదానికి కోచింగులు, ట్రైనింగులు భరించే శక్తి ఎక్కడిది సారూ..''

పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంటున్న, నాన్నను చూస్తే నాకూ ఏడుపు తన్ను కొచ్చేది...

పేదరికం ఎంత శాపం?

నాన్నంటే నాకెంతో ఇష్టం... సంతానం ముగ్గురూ ఆడపిల్లలయినా, ఏనాడూ మమ్మల్ని తక్కువచేసి చూడలేదు.... పున్నామ నరకంనుంచి తప్పించే పుత్రుడు లేడని, మామీద మమకారం చంపేసుకోలేదు.

తోపుడు బండితో వీధివీధికి తిరిగి ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకునే నాన్న ఆదాయమెంతో నాకు తెలియనిది కాదు.. అందుకే, అందరూ నా అందమైన చేతి రాతని మెచ్చుకుంటుంటే, మార్చలేని నా తల రాతని ప్రతి క్షణం గుర్తుకు తెచ్చుకుని సర్దుకుపోయే దాన్ని. ఏనాడూ ఆకాశానికి నిచ్చెనలేయలేదు... అందని అంతస్థుల కోసం ఆరాట పడలేదు.. నేనేదో పరుగులో ప్రతిభ గలదాన్నని, దానిని పదును పెట్టుకుంటే, అంచెలంచెలుగా జీవితంలో ఎదగవచ్చని లేనిపోని ఆశలు పెంచుకోలేదు...

ఐతేనేం... స్కూల్లో ఏ పరుగు పందెంలో పాల్గొన్నా, ఏదో ఒక ప్రైజు తప్పక సాధించే దాన్ని...

చదువు కొనసాగి వుంటే, నా జీవితం ఎలా వుండేదో... కానీ... మాకు మిగిలివున్న కాస్త ఆనం దాన్ని కూడా చూడలేని విధికి కన్ను కుట్టింది గాబోలు... చీకటి తెరలు విడిపోక ముందే పాచి పనికి బయలుదేరే అమ్మని, ఓ ఉదయాన, గుర్తుతెలియని వాహనమేదో గుద్దేసి కనుమరుగైపోయింది.

శరీరమంతా గాయాలై, కొన ఊపిరితో వున్న అమ్మని హాస్పిటల్‌లో చేర్పించారెవరో పుణ్యాత్ములు..

గవర్నమెంట్ ఆసుపత్రుల్లోకూడా, విరిగిన మంచాల్లోనే కాదు... తెల్ల డ్రస్సుల్లో తిరిగే డాక్టర్లు, నర్సులు, వార్డు బాయ్‌ల రూపంలో కూడా జలగలుంటాయి... అవి ఫీజులు, లంచాల రూపంలో మా రక్తాన్ని పీల్చేశాయి.

ఫలితం... అమ్మ దక్కలేదు.. కానీ... అప్పు మాత్రం మిగిలింది...

ఆ షాక్ నుండి నాన్న యిక కోలుకోలేక పోయాడు... నాన్న కుటుంబాన్ని ప్రేమించే మనిషి... మనుషుల్ని నమ్మే మనిషి.... మమతానురాగాలకి విలువనిచ్చే మనిషి..

అమ్మలేని లోటు క్రమంగా ఆయన్ని కృంగదీసింది... మానసికంగా ఎంతో చితికిపోయాడు..

మాకు తనే అమ్మగా మారాడు... అలాంటి పరిస్థితిలో మరెవరైనా వుంటే, మందుకో మరే వ్యసనానికో బానిసైపోయేవారేమో... కాని.. నాన్నకి మాతోనే లోకం.. మా గురించే ఆలోచన...

నా చదువు ఏడో తరగతిలోనే ఆగిపోయింది.... అక్కలు పనిమనుషులుగా మారిపోయారు...

మాకు వయసొచ్చేకొద్దీ నాన్న దిగులు మరింతగా పెరగసాగింది.. ఎదుగుతున్న కూతుళ్ళ పెళ్ళి నాన్నకు ఓ కొత్త సమస్య.

నాన్న అశక్తతని అర్థంచేసుకున్నారో, తమ భవిష్యత్తుని తామే నిర్ధేశించుకున్నారో గానీ, అక్కలు ఒకరు సినిమా హాల్లో వాచ్‌మన్ తోనూ, మరొకరు వెనుకవీధి టైలర్ తోనూ సెటిలైపోయారు.

ఇక మిగిలింది నేను...

''ఈ పేదతండ్రి నీ పెళ్ళి చేయలేడమ్మా.. నీ అక్కలలాగే నువ్వు కూడా ఓ దారి వెతుక్కో తల్లీ... ప్రపంచంలో ఏ తండ్రీ తన కూతుర్ని లేచిపొమ్మని చెప్పివుండడు. కానీ ఈ దౌర్భాగ్యుడి కడుపున పుట్టిన పాపానికి, ఈ సలహా నీకు నేనిస్తున్న పెళ్ళి కానుక... నన్ను క్షమిస్తావు కదూ...'' అంటూ నా చేతుల్లో ముఖం దాచుకుని భోరుమన్నాడో రోజు...

నాన్నను అలా చూడడం చాలా కష్టంగా వుంది... మాకు నాన్న ఏం లోటు చేసాడు... పేదరికం అంటే డబ్బు లేకపోవడం కాదు.. ప్రేమ లేకపోవడం... నాన్న తన ప్రేమని పుష్కలంగా పంచుతునే వున్నాడు... అది చాలు నాకు...

''పెళ్ళి గురించి నేనేమీ ఆరాటపడడంలేదు నాన్నా... అసలు పెళ్ళి చేసుకుని నిన్ను ఒంటరి వదిలి నాదారి నేను చూసుకోలేను.. నీకు తోడు నేనున్నాను.. నా గురించి బెంగ పడకు నాన్నా...'' నా మాటల్లో నిజాయితీ వుంది... రోజు రోజుకీ క్షీణిస్తున్న నాన్న ఆరోగ్యం పట్ల ఆందోళన వుంది.

నాన్న ఒక రోజు బరస్ట్ అయ్యాడు... ''నీకు తెలుసా తల్లీ... ఇద్దరమ్మాయిల తర్వాత, మూడో బిడ్డగా నువ్వు ఆడపిల్లగా పుట్టినప్పుడు, మీ అమ్మని ఎందరు ఎన్నెన్ని మాటలన్నారో.. ఎందరు చీదరించుకున్నారో.. పురిట్లోనే గొంతు పిసికి, డ్రైనేజ్‌లో పడెయ్యమని ఎంత ఒత్తిడి తెచ్చారో.. కానీ నేనొప్పుకోలేదు.. ఆ రాబంధువుల నుండి మీ అమ్మని నేను రక్షించుకున్నాను... ఆడేమిటి, మగేమిటి.. ఎవరైనా ఒక్కటే.. సహనానికి, శాంతానికి మరోరూపం ఆడదని, మీ అమ్మనుండే నేను తెలుసుకున్నాను.. నా ఆలోచనలు తప్పు కాలేదని నువ్వు నిరూపిస్తున్నావమ్మా.. నిన్ను చూసి గర్వపడుతున్నాను తల్లీ... మళ్ళీ మళ్ళీ జన్మంటూ వుంటే నీకు కూతురుగా పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను...''

ఈ ప్రపంచంలో ఎందరు భర్తలు తమ భార్యల్ని ఇంతగా ప్రేమిస్తున్నారు.. కన్న వారిని, వున్నవూరిని విడిచి ఏడడుగులు నడచి వచ్చిన సహధర్మచారిణిని గుండెల్లో ప్రతిష్టించి ఆరాధిస్తున్నారు.... నాన్న పట్ల నా గౌరవం రోజు రోజుకీ పెరుగుతూనే వుంది... ఐ లవ్ యూ నాన్నా...

ఒక రోజు నాన్న చాలా ఆనందంగా కనిపించాడు.. కళ్ళల్లో మెరుపులు.. మాటల్లో ఉద్వేగం..

''నీకో శుభవార్త చెప్పాలమ్మా... ఓ మంచి సంబంధం చూశాను.. పట్నంలో టేక్సీ నడుపుతాడు కుర్రాడు... వాళ్ళు నాకు ఇంతకు ముందు కొద్దిగా పరిచయం వున్న వాళ్ళే.. మంచి సంబంధం... ఇన్నాళ్ళకు, నీ జీవితానికో దారి చూపించే అవకాశం వచ్చింది... నీపెళ్ళి అయిపోతే నేనిక నిశ్చింతగా వుండొచ్చు గదమ్మా!''

నా గుండెల్లో రాయి పడింది.

నాన్నకు మిగిలిన ఒకే ఒక ఆధారం.. నేను కూడా పెళ్ళి



చేసుకుని దూరంగా వెళ్ళిపోతే...

కానీ... నాన్న వినలేదు.. ముగింపు కొచ్చిన తన జీవితంకన్నా, రూపుదిద్దుకోబోతున్న నా భవిష్యత్తు ముఖ్యమన్నాడు.. తన వాదంతో నా మనసుని ఒప్పించాడు...

నాన్నని వదిలి పట్నానికి కాపురానికొచ్చాను...

కొత్త జీవితం.... కొత్త సంసారం.. కొత్త కలలు, కొత్త కోరికలు, గాలి బుడగలుగా ఎదిగి, ఎదిగి..

క్రమంగా ఫెటిల్లున పగులుతూ...

మరి కొద్ది రోజుల్లోనే నాన్న ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయారు... చుట్టూ ఎందరున్నా, నాన్న లేరనే ఊహే, అత్యంత బాధించేది... అమ్మని కోల్పోయిన రోజు, నాన్న నాకు అమ్మయ్యారు.. మరి నాన్నే



దూరమైనరోజు, నా భర్త ఆ అగాధాన్ని పూడ్చగలరా?

ఈ లోగా...

తొలిసారి అమ్మ కాబోతున్నానని తెలిసిన రోజున.. మా అత్తమామలు సంబరాలు చేసుకున్నారు.... తమకి వంశాంకురాన్నిస్తున్నందుకు నన్ను అభినందనల్లో ముంచెత్తారు.. నా భర్త నన్ను గాల్లో గిరగిర తిప్పారు.. నా కళ్ళు తిరిగి చుక్కలు కనిపించేవరకు...

''నాకు మనవడే కావాలి కోడలా...'' అత్తమామలు...

''మనబ్బాయికి మాంచి మోడ్రన్ పేరు సెలక్ట్ చేసివుంచాను.. వాడ్ని తొందరగా కనడం నీదే లేటు..'' నా భర్త.

పుట్టబోయేది అబ్బాయేనని అప్పుడే, అందరూ ఓ నిర్ణయానికొచ్చేశారు... నెలలు నిండేకొద్దీ నాలో ఆందోళన పెంచేశారు...

మొదటి బిడ్డ అమ్మాయి....

ఆ రోజు నేనుపడ్డ నరకం ఎలా చెప్పాను? నేను పడ్డ మాటలు ఒక్కొక్కటీ శూలాల్లా గుచ్చుకున్నాయి...

ఆడపిల్లయితే బిడ్డ కాదా... మా రక్తం పంచుకో లేదా?

ఆ రోజు నుంచీ నా జీవితం మారిపోయింది... నేను ఆ యింటికి పట్టిన శని దేవతనట.. నిజానికి నేను చేసిన తప్పేమిటి? మనసు కష్టపడినప్పుడు ధైర్యం చెప్పాల్సిన భర్తే, ముఖం చాటేస్తున్నాడు... నన్నో అపరాధిలా చూస్తున్నాడు...

కాలమే మనుషుల్ని, మనసుల్ని మారుస్తుందంటారు.. కానీ ఆ కాలం ఎప్పుడు వచ్చేను... నాన్న పదేపదే గుర్తుకొస్తున్నారు.. నన్ను అక్కున చేర్చుకుని ఓదారుస్తున్నారు...

ఆరు నెలలు తిరక్కముందే మళ్ళీ గర్భం దాల్చాను.... ఈసారి, నా భర్త తన జాగ్రత్తలో తానున్నాడు.. నాలుగో నెలలో స్కానింగ్ చేయించాడు.. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమైనా, పది రూపాయల కోసం పదిసార్లు కక్కుర్తి పడే డాక్టర్లకి ఈ దేశంలో కొదవలేదు...

మళ్ళీ ఆడపిల్లేనట... నా భర్త ముఖం కందగడ్డలా మారిపోయింది... మాట వికృతమైపోయింది... క్షణాలమీద గర్భ విచ్ఛిత్తికి ఏర్పాట్లు చేసేసాడు. ఏం జరుగుతోందో తెలిసే లోపలే. డబ్బు దొరుకుతుందంటే, కన్న తల్లికి కూడా శీల పరీక్ష చేయడానికి వెనుకాడని ఓ డాక్టరు, నా కడుపు తేలిక పరిచేసాడు.. ఏవరికి తెలుసు, నా గుండె మరింత బరువైందని?

అందరూ కలిసి నా జీవితానికి ఒకే ఒక లక్ష్యం ఏర్పరచారు... కొడుకుని కనివ్వడం.. అప్పుడే నా ఆడ జన్మకి సార్ధకమట.

వెంట వెంటనే గర్భం.. మూడోసారి.. నాలుగోసారి...

తొమ్మిదేళ్ళలో అరడజను అబార్షన్లు... నా మనసుకు విలువ లేదు... మాటకు లెక్క లేదు... నేనో యంత్రాన్ని... ప్రయోగశాలలో నాళికని... పుత్ర సంతానమనే ఫలితం ప్రాప్తించే వరకు, నా భర్త రోజూ రసాయనాన్ని నాలోకి విడుదల చేస్తూనే వుంటాడు...

సహనం చచ్చిపోయి ఎదురు తిరిగినందుకు, చిత్రహింసల పాలయ్యాను.. క్రమంగా నా భర్తలో చాదస్తం, మూఢనమ్మకాలు ఎక్కువైపోయాయి... మగపిల్లాడు కలగడానికి, ఎవరెవరో చెప్పిన చిట్కా

లన్నీ నా మీద ప్రయోగించారు... క్షుద్రపూజలు చేయమనేవారు... ఎర్రగా కాల్చిన సూదుల్ని నా చెవుల్లో గుచ్చేవారు.. మంత్రించిన ఎండు మిరపకాయల్ని కాళ్ళమధ్య పెట్టుకుని నిద్రపొమ్మనేవారు...

ఇంకా సభ్యసమాజానికి చెప్పుకోలేని ఎన్నో పద్ధతుల్ని నాపై రుద్దేవారు...

వారి పైశాచికత్వం పరాకాష్టకి చేరుకుంది. మాట వినకపోతే, రోజుల తరబడి పస్తులు దాహంతో అల్లల్లాడిపోతున్నప్పుడు, అతడు తన మూత్రాన్ని బలవంతాన త్రాగించేవాడు....

జీవితంలో ఏ ఆశ మిగిలిపోయిందని బ్రతకాలి? అయినా బ్రతుకుతున్నాను.. నాకు తోడుగా మిగిలిన మొదటి బిడ్డకోసం... పాపం... ఆడపిల్లగా పుట్టినందుకు, ఎలాంటి అనురాగానికీ నోచుకోలేక పోతోంది...

మరోసారి గర్భం దాల్చాను.. నా ప్రమేయం లేకుండనే....

నాలో శక్తి క్రమంగా క్షీణించి పోయింది. ఓపిక ఏమాత్రం మిగల్లేదు.. ఒకదాని వెంట ఒకటిగా సాగిన అబార్షన్లతో, నా గర్భాశయం బలహీనపడింది.. పోషకాహార లేమి, మానసిక శారీరక హింసలతో నేను మనిషిగా జీవచ్ఛవాన్నయిపోయాను..

మళ్ళీ డాక్టరు పరీక్షలు... ఈసారీ ఆడబిడ్డే కలగబోతోందట.. తరువాత జరిగేదేమిటో నాకు తెలుసు.

ఈసారెందుకో నాలో తెగింపు.. ఎన్నాళ్ళీ నరకం? ఎక్కడ దీనికి అంతం? ఏదేమైనా బిడ్డని కనడానికే నిర్ణయించుకున్నాను.. ఈ వ్యవహారం ఇక్కడితో ఆగిపోవాలి.

కానీ... అత్తమామలు కాలరుద్రులయ్యారు.... భర్త యమధర్మరాజయ్యాడు.. లోకం ఎద్దుపుండుని పొడుచుకుతినే కాకి గుంపయింది...

వీటన్నిటిని తట్టుకుని రోజులు దొర్లిస్తున్నాను.. ఏడో నెలలోకి ప్రవేశించాను...

ఈలోగా ఓ కొత్త విషయం తెలిసింది.. నాకు పుత్రసంతానం కలగడంలేదని, నా భర్త రహస్యంగా మరో పెళ్ళి చేసుకున్నాడు.. కానీ.. పాపం ఆ రెండో భార్య గతి కూడా నాలాగే.. రెండు అబార్షన్లయ్యాయిట...

''హాస్పిటల్‌కి వెళ్దాం పద'' అన్నాడు నా భర్త... బాగా తాగి వున్నాడని తెలుస్తోంది.. మందు వాసన గుప్పున వాంతి తెప్పిస్తోంది.. ఎక్కడో, ఎవరి దగ్గరో నా గురించి చర్చించి వచ్చివుంటాడు.. ఏదో తెలీని ఆవేశంలో వున్నాడు.

నేను రానన్నాను.... ఏడో నెలలో అబార్షన్ కుదరదు... కుదిరినా, నేనందుకు ఒప్పుకోదలచుకోలేదు...

''నువ్వు చచ్చినా పర్లేదు.. నీ కడుపులోని ఆ ము... ప్రాణాలతో ఈ ప్రపంచంలోకి రావడానికి వీల్లేదు...''

ఎంత దారుణం.. ఎంత నిస్సిగ్గుగా మాట్లాడుతున్నాడు...

రక్తపాశమనే మాటకి వీళ్ళ నిఘంటువులో అర్థమేలేదా? బైట ప్రపంచంలోని దుర్మార్గాల్ని, దుష్ట మనస్తత్వాల్ని తెలీని ఆ చిన్ని ప్రాణం, తను కన్ను తెరవక ముందే, తన శ్వాసని శాశ్వతంగా ఆపేసే కుట్ర జరుగుతోందని తెలీక, లేత పాదాలతో నను తాకుతున్న స్పర్శ తెలుస్తోంది...

నా భర్తని విడిపించుకుని లోనికి పరిగెత్తాను...

వెనుకే అతడు.. పూనకం వచ్చినవాడిలా ఊగిపోతున్నాడు.. ''ఎక్కడికి పరిగెడతావే ల..... నన్ను దాటి పోగలననే అనుకుంటున్నావా... ఈరోజు నీకు మూడిందే... డాక్టరు దాకా ఎందుకు... నీ కడుపు నేనే తీసేస్తాను...'' పిచ్చి పట్టినట్టుగా అరుస్తున్నాడు....

ఎటునుండి వచ్చారో, అత్తమామలు నన్ను గట్టిగా ఒడిసి పట్టుకున్నారు... చేతిలో కూరగాయల కత్తితో నా భర్త ఒకో అడుగు ముందుకేస్తున్నాడు...

పెనుగులాడుతున్నాను.. ప్రాణాల కోసం.. నా చీర ఊడిపోయింది.. జాకెట్టు చిరిగిపోయింది.. లంగా బొందు జారిపోయింది.. నేను ముప్పాతిక నగ్నంగా... వారి ముందు కుప్పకూలిపోయాను...

''సర్...'' కత్తి అంచు నా మెడక్రింద ఆరంగుళాల మేర చీరేసింది.. కొద్దిగా గురి తప్పకపోయి వుంటే, ఈ సరికి నా కడుపు రెండుగా చీలిపోయేదే...

ధారలుగా కారుతోంది రక్తం... గాయమైంది శరీరానికే.. కానీ మనసు రక్తకన్నీటి సంద్రమై చాలా కాలమైంది... నాలో ఒక్కసారిగా ఎక్కడలేని శక్తి!

వారెవ్వరి ఊహకందనంత వేగంగా రివ్వున లేచి, బలంగా వారిని విదిలించుకుని, బాణంలా బైటకి దూసుకుపోయాను...

నా వెనుకే అతడు... కత్తితో... కసితో.. క్రౌర్యంతో...

పరిగెడుతున్నాను.. గమ్యంతెలీని పరుగు... నగ్నంగా, నడివీధిలో....

అలా ఎంతసేపు పరిగెట్టానో.. వీధులు దాటి, సందులు దాటి....

అయ్యో! ఒక్కరూ నన్నాదుకోవడానికి ముందు కురారేం? నా నగ్నత్వం వారికి కనువిందు చేస్తోందా... లేనిపోని తలనొప్పులెందుకనే నిర్లిప్తత వారినావహించిందా?

నాలో శక్తి క్షీణిస్తోంది... ఏ క్షణాన్నయినా కూలబడిపోయేలా వున్నాను.. నా చావు ఘడియలు దగ్గర పడ్డాయా?

సరిగ్గా అప్పుడు వినిపించింది... హఠాత్తుగా ఓ ఆర్తనాదం... పరుగు ఆపకుండానే ఓసారి వెనుతిరిగి చూశాను...

అతడు క్రిందపడి వున్నాడు.. గిలగిల కొట్టుకుంటున్నాడు.. పొట్ట చేత్తో అదుముకుంటూ మెలికలు తిరిగిపోతున్నాడు...

నా కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.. పరుగు ఆగిపోయింది...

అక్కడ దృశ్యం....

రుద్రకాళిలా నిలబడి వుందో స్త్రీ... ఆమె కళ్ళు అగ్ని కణాల్లా నిప్పులు చిమ్ముతున్నాయి... చేతిలోని కత్తిపీట రక్తం కక్కుతోంది...


నేను చూస్తుండగానే, ఈసారి వేటు అతడి మెడపై వేసింది... ఓ నరకుడు కుప్పకూలిపోయాడు... మెడలోని తాడు తీసి, అతడిపై విసిరికొట్టింది...

ఆమె.... నాకు తెలీకుండా, నా భర్త పెళ్ళాడిన రెండో భార్య... తన భర్తకు పుత్రసంతానాన్ని యివ్వలేని నాలాంటి మరో అభాగిని...

ఆమె నా దగ్గరికొచ్చింది... కనురెప్పపాటులో తన చీరను సగానికి చింపి, నా నగ్నత్వానికి రక్షణగా చుట్టింది..

*

రచయిత ఫోన్ నెం: **08922-273329**



## నమిత కిడ్నాప్?

మీరు చదువుతున్నది నిజమే! కాకపోతే కిడ్నాప్ కాదు, కిడ్నాప్ యత్నం జరిగింది అంతే! అందాల భామ నమితను కిడ్నాప్ చేయవలసినంత అవసరం, ఆసక్తి ఎవరికుంటుంది? అనేనా మీ అనుమానం?

నమిత అంటే పిచ్చి అభిమానం పెంచుకున్న ఓ వీరాభిమాని ఆమెను ఒక్కసారి కలిసి మాట్లాడాలని తపించిపోయాడు. తన కోరిక తీర్చుకోవడానికి రకరకాలుగా ప్రయత్నించి చూశాడు. అయినా అతగాడి కోరిక తీరలేదు. ఈ విధంగా అయితే తాను నమితతో మాట్లాడలేనని నిర్ణయించుకొని, విమానాశ్రయంలో ఆమెను కిడ్నాప్ చేయడానికి ప్లాన్ చేసుకున్నాడు. అయితే ఆ ప్లాన్‌ను అధికారులు పసిగట్టేసి అతని ప్రయత్నానికి గండికొట్టేశారు. అదీ సంగతి...